క్లుప్తంగా

పంచామృతాభిషేకం

అర్వపల్లి : తిమ్మాపురం శివారులోని సూర్యక్షేత్రం ఆవరణలో ఉన్న కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం జరిపారు. అలాగే 108 నాగవల్లి దళాలతో ఆకుపూజ, గంధ సింధూరంతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, మాలధారులు పాల్గొన్నారు.

కార్యాలయాలు నాగారంలో నిర్మించాలని వినతి



నాగారంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

తిరుమలగిరి : నాగారం మండలానికి మంజూరైన తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ వంటి ప్రభుత్వ కార్యాలయాలను మండల కేంద్రమైన నాగారంలోనే నిర్మించాలని కోరుతూ మంగళవారం ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏ జిల్లా నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరికిషోర్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలను చుట్టు పక్క గ్రామాల్లో కాకుండా మండల కేంద్రమైన నాగారంలోనే నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు చిప్పలపల్లి నాగార్జున, జిల్లా నాయకులు డి.విజయరామరాజు, పి.శ్రీనివాస్, వినయ్, విజయ్, వీరయ్య, అంజి, వెంకన్న, బన్నీ, నాగరాజు, నవీన్, శివకుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నివాళులర్పిస్తున్న స్నేహితులు

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థి ఆమనగంటి యాదగిరి అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి స్నేహితులు మంగళవారం రూ.22 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేను శ్రీనివాస్, తునికిపాటి రాంబాబు, ఎస్.వెంకట్‌రెడ్డి, లక్ష్మయ్య, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, మహేష్, యాదగిరి, జావేద్‌అలీ పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ శిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : అర్వపల్లిలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు క్షయ నిర్ధారణ ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మందికి పరీక్షలు జరిపారు. క్షయవ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, సూపర్‌వైజర్ లలిత, ఎల్‌టీ చొక్కయ్య, హెల్త్ అసిస్టెంట్ జ్యోతి, ఆశాకార్యకర్తలు స్వరూప, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

డొంక దారి బీటీగా మారదా..?



పనుల వివరాల బోర్డు



తూర్పుగూడెం నుంచి వెంపటి వెళ్లే డొంక దారి



బురదమయంగా మారిన దారి

- రెండేళ్ల క్రితమే రోడ్డు నిర్మాణానికి రూ.4.47కోట్లు మంజూరు
- పనులు చేపట్టి మధ్యలోనే నిలిపేసిన కాంట్రాక్టర్
- త్వరగా పూర్తిచేయాలని కోరుతున్న ఆయా గ్రామాల ప్రజలు

తిరుమలగిరి : తుంగతుర్తి మండలం తూర్పుగూడెం నుంచి బండ రామారం, సూర్య తండా వరకు ఉన్న రోడ్డు ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గతంలోనే ప్రభుత్వం 8.90 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 447 లక్షల రూపాయలు మంజూరు చేసినా, పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు గుంతలు, బురదతో నిండిన ఈ దారిలో వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. 2023లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి తూర్పుగూడెం నుంచి రామన్నగూడెం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించారే తప్ప, ఆ తర్వాత రెండేళ్లుగా ఎలాంటి పురోగతి లేదు. దీంతో రామన్నగూడెం నుంచి బండ రామారం, సూర్య తండా వరకు రోడ్డు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. సూర్యతండా నుంచి నిత్యం వెంపటి, రామన్నగూడెం గ్రామాలకు గిరిజనులు రాకపోకలు సాగిస్తారు. సూర్యతండా నుంచి బండరామారం, తుంగతుర్తి, వెంపటి, తూర్పుగూడెం గ్రామాలకు గిరిజనులు కూరగాయలను అమ్ముకోవడానికి వెళ్లాలంటే సుమారుగా 15 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. తూర్పుగూడెం నుంచి వెంపటి, రామన్నగూడెం, బండ్లరామారం, సూర్యతండా గ్రామాలకు వెళ్లే రోడ్డు పనులు పూర్తయితే 6 కిలోమీటర్ల దూర భారం తగ్గుతుంది. బండరామారాం, సూర్యతండా నుంచి రామన్నగూడెం వరకు రహదారి డొంక దారి కావడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



బండరామారం, సూర్యతండా నుంచి రామన్నగూడెం, వెంపటి, తూర్పుగూడెం వరకు వెళ్లే రోడ్డు డొంక దారి కావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మేము నిత్యం కూరగాయలు అమ్ముకోవడానికి, ఇతర పనులకు ఈ దారి గుండానే ప్రయాణం చేయవలసి ఉంటుంది. రోడ్డు పనులు మొదలుపెట్టి పూర్తి చేయకుండానే వదిలేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– లకావత్ యాకు నాయక్, మాజీ సర్పంచ్, సూర్యతండా

అక్టోబర్ 2వరకు లోక కల్యాణ మేళా

- మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి



మాట్లాడుతున్న హనుమంత రెడ్డి

సూర్యాపేట అర్బన్ : వీధి వ్యాపారుల కోసం సూర్యాపేట పట్టణంలో సెప్టెంబర్ 17 నుంచి నిర్వహిస్తున్న లోక కల్యాణ మేళా అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందని మెప్మా పీడీ, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం కింద మొదటి విడతలో రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేల రుణాలు మంజూరు చేసి, వారి వ్యాపార విస్తరణకు తోడ్పడుతున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారుల కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వారికి వివిధ రకాల బీమా పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు ఆహార భద్రత, పరిశుభ్రతపై ఎఫ్ఎస్ ఎస్ఏఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ జి.వసంతకుమార్, ఎఫ్ఎస్ఎస్ఏఐ కోఆర్డినేటర్ డాక్టర్ శంకర్‌నారాయణ, జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్ ఖదీర్, టీఎంసీ ఇ.శ్వేత, సీఓలు ఎస్.రోజా, సీహెచ్. సువర్ణ, బి.ఉమారాణి, పాపమ్మ, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

మినీ ట్యాంక్ బండ్‌పై కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి స్వచ్ఛతపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని అన్నారు. చెరువు ప్రాంతాలలో పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, యాదగిరి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, కరాటే మాస్టర్ చిన్న, జవాన్ వెంకన్న, వేణు, శీను పాల్గొన్నారు.



సద్దుల చెరువు వద్ద కరాటే విద్యార్థులతో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

క్యూలో ఉన్నా.. కొందరికే యూరియా



నాగారం మండల కేంద్రంలో యూరియా కోసం బారులుదీరిన రైతులు



నెమ్మికల్‌లో క్యూలో చెప్పులు, చెట్ల కొమ్మలు

అర్వపల్లి : అర్వపల్లి పీఏసీఎస్ ఎదుట మంగళవారం కూడా రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు యూరియా కోసం క్యూలో వేచి ఉన్నారు. అయితే కేంద్రంలో ఉన్న కొద్దిపాటి యూరియాను ముందు వరుసలో ఉన్న రైతులకు పంపిణీ చేశారు. వెనుక ఉన్న రైతులకు యూరియా దొరక్క వెనుదిరిగిపోయారు. ఈ సందర్భంగా రైతులు పీఏసీఎస్ సిబ్బందిని నిలదీశారు. యూరియా కోసం ఇంకా ఎన్నిరోజులు తిరగాలని ఆవేదన వ్యక్తం చేశారు.

తిరుమలగిరి : రైతులకు యూరియా కష్టాలు ఇప్పట్లో తీరేలా కన్పించడం లేదు. నాగారం మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు తెల్లవారు జాము నుంచే బారులుదీరారు. పంపిణీ కేంద్రం రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకాన్ని సీరియల్‌లో పెట్టి తమవంతు కోసం సాయంత్రం వరకు వేచి చూశారు. కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా యూరియా తిప్పలు తప్పడం లేదు. మంగళవారం నెమ్మికల్ పీఏసీఎస్ వద్ద టోకెన్లు ఇచ్చారు. ఈ టోకెన్లు పొందిన రైతులు ఉదయం నుంచే క్యూలైన్‌లో నిల్చున్నారు. అలాగే గ్రోమోర్ వద్ద యూరియా బస్తాలు ఇవ్వడంతో తెల్లవారుజాము నుంచే రైతులు పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులను లైన్‌లో ఉంచారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

తిరుమలగిరి : యూరియా కోసం రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలోని గ్రోమోర్‌కు యూరియా రావడంతో రైతులు బారులుదీరారు. అయితే చాలా మందికి యూరియా అందకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. ప్రభుత్వాలు స్పందించి యూరియా కొరతను తీర్చాలని పలువురు కోరుతున్నారు.



మద్దిరాలలో బారులుదీరిన రైతులు



అర్వపల్లిలో పీఏసీఎస్ ఎదుట..

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

తిరుమలగిరి : వెలిశాల గ్రామానికి చెందిన రెడ్డె బోయిన నరేష్ యాదవ్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.32000 చెక్కు మంజూరైంది. ఆ చెక్కును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుంభం సతీష్ గౌడ్ లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాకనాటి విజయ్ గోపాల్ రెడ్డి, దండిగ వెంకన్న, చిలుకల శ్రీశైలం యాదవ్, పొన్నం వెంకన్న, షేక్ భవాని, పాడిశెట్టి జగతి, సట్టు ముత్తయ్య, పులిమాడి అశోక్, దుపటి శంకర్, జెర్రిపోతుల చంద్రయ్య, ఏపూరి బక్కులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న పల్లె రవికుమార్

తిరుమలగిరి : తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వర్దెల్లి పెద్ద సోమక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె చిత్రపటానికి మంగళవారం తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు శేషరామ్ నాయక్, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం కార్యదర్శి పోగుల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం



చిన్ననెమిల అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

తిరుమలగిరి : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీజ అన్నారు. మంగళవారం నాగారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–1, 2 కేంద్రాల్లో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోషకాహార లోపం ఉంటే పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని, మహిళలు, కిషోర బాలికల్లో రక్తహీనత ఏర్పడుతుందని తెలిపారు. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రొటీన్లు, విటమిన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు కజ్జం హరిత, సీహెచ్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రతి ఒక్కరూ పోషకాహారం తయారు చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజులతరెడ్డి అన్నారు. మంగళవారం నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. పోషకాహారాన్ని తక్కువ ఖర్చుతో ఇంటిలోనే తయారు చేసుకోవచ్చని అన్నారు. పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బండపల్లి అరుణ, బత్తుల రేణుక, ఆయాలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మద్దిరాల మండల పరిధిలోని చిన్ననెమిల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణమాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ మాట్లాడారు. ఇంటికి పునాది ఎంత ముఖ్యమో చిన్నారులకు బాల్యంలో ఆరు సంవత్సరాలు అంతే ముఖ్యమని అన్నారు. చిన్నప్పటి నుంచే పోషకాహారం పొందుతూ ఆరోగ్యంగా ఉంటే భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, ఉమ, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



నాగారంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ



చిల్పకుంట్లలో..

కళాశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని సాయి గౌతమి జూనియర్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగు రంగు పూలతో అందంగా బతుకమ్మలను తయారు చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి చేసిన కోలాటాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం.భగవాన్ రెడ్డి, ప్రిన్సిపాల్ వై.లక్ష్మయ్య గౌడ్, డైరెక్టర్ టి.సోమిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీ పారా మెడికల్ కళాశాలలో..

జిల్లా కేంద్రంలోని లక్ష్మీ పారా మెడికల్ అండ్ తిరుమల స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగు పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆడి పాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శాతరాజుపల్లి రాము, డైరెక్టర్ చిలువేరు రమేష్ గౌడ్ పాల్గొన్నారు.



బతుకమ్మలతో లక్ష్మీపారామెడికల్ విద్యార్థులు



సాయి గౌతమి కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల సిబ్బంది

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

మునగాల : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని మండల పరిధిలోని వెంకట్రాంపురంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైలారశెట్టి నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి సీహెచ్.జ్యోతి, నాయకులు దొంగరి నాగజ్యోతి, సీనియర్ నాయకులు రణబోతు శ్రీనివాస రెడ్డి, వీరబోయిన వినోద్, రెడ్డిపల్లి సైదులు, గుండు ప్రకాష్, దొంగరి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

జీఓ 12ను సవరించాలి

కోదాడ : భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలనే జీఓ నంబర్ 12ను సవరించి, కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కోదాడ పట్టణంలోని లేబర్ ఆఫీస్‌ను భవన నిర్మాణ కార్మికులు ముట్టడించారు. అనంతరం ఆఫీస్ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బాలాజీ నాయక్, నాగలక్ష్మి, రవీందర్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు పాటించాలి



వివిధ రకాల న్యూట్రిషన్ ఫుడ్ తయారు చేసి ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

సూర్యాపేటటౌన్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని శ్రీలక్ష్మీవెంకటసాయి స్కూల్ అండ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ కారింగుల బాలగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో జీఎన్ఎమ్, బీఎస్సీ నర్సింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్‌లో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ ప్రయోజనాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల న్యూట్రిషన్ వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. మిల్లెట్ రోటీ, మిక్స్‌డ్ జ్యూస్, ఫ్రూట్ సలాడ్, రాగి ముద్ద, ఓట్స్ మీల్, ఫిష్, చికెన్ ఫ్రై, జాగ్రి రైస్, రాజ్మా, మిక్స్‌డ్ దాల్ వంటి న్యూట్రిషన్ వంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కరస్పాండెంట్ బాలగౌడ్ మాట్లాడుతూ న్యూట్రిషన్ ఫుడ్ శరీరం సక్రమంగా పనిచేయడానికి అవసరమైన శక్తిని, పోషకాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారింగుల విజయలక్ష్మి, జీఎన్ఎమ్, బీఎస్సీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోత్స్న, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి, అధ్యాపకులు నరేష్, వందన, యశోద, సరిత, విజయవాణి, దుర్గ భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా తీసుకోవాలి

కోదాడరూరల్ : క్రీడా స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన చెస్ క్రీడాకారుడు మేకల అభినవ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పట్టణ ప్రముఖులు అన్నారు. మంగళవారం అభినవ్ 24వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెస్ క్రీడలో రాణిస్తూ కోదాడ పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన అభినవ్ చిన్నవయస్సులోనే మృతి చెందడం బాధాకరమని అన్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, మేకల వెంకటేశ్వర్లు, అరుణ, పార సీతయ్య పాల్గొన్నారు.

దండు మైసమ్మ ఆలయం వద్ద రూ.50కి కొబ్బరికాయ

- కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం వద్ద ఇష్టానుసారంగా ఒక్కో కొబ్బరికాయ రూ.50లకు విక్రయిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ కొబ్బరికాయల కాంట్రాక్టర్, ఆలయ అధికారిపై స్థానికులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం నెమ్మికల్‌లో వారు మాట్లాడారు. 2024 డిసెంబర్‌లో కొబ్బరికాయల వేలంపాటను గుట్టు చప్పుడు కాకుండా హైదరాబాద్‌లో ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయంలో రూ.6.98 లక్షలకు దక్కించుకున్న స్థానిక కాంట్రాక్టర్ రేణుకుంట్ల ఉపేందర్ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కొబ్బరికాయలు నిబంధనల ప్రకారం రూ.30లకు చిల్లర షాపులు, పూలు అమ్మే వారికి ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ఇటీవల బదిలీపై వచ్చిన ఎండోమెంట్ అధికారి సహకారంతో కాంట్రాక్టర్ రూ.40లకు అమ్మడంతో చిల్లర వ్యాపారులు భక్తులకు రూ.50 చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. ఎండోమెంట్ అధికారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, పైగా విధులకు సక్రమంగా హాజరుకావడంలేదని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ గోపగాని సత్యం, బుడిగె సైదులు, రేపాక వెంకటరెడ్డి, గోపాలకృష్ణ, బి.వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

గాయత్రీదేవి అవతారంలో దుర్గామాత

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దుర్గామాత మంగళవారం గాయత్రీ దేవి రూపంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



తిమ్మాపురంలో పూజలు చేస్తున్న భక్తులు



మద్దిరాల మండలం కుక్కడంలో..



తిరుమలగిరిలో పూజలు చేస్తున్న భక్తులు



నాగారం మండలం మాచిరెడ్డిపల్లిలో..



పెన్‌పహాడ్ మండలం అనంతారంలో..



నూతనకల్ మండలం అల్లునూరులో..

రూ.50వేలు విరాళం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించబోయే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పీఏసీఎస్ మాజీ చైర్మన్, సీనియర్ నాయకుడు ఇందుర్తి వెంకట్‌రెడ్డి మంగళవారం రూ.50వేలు విరాళంగా ప్రకటించారు. దీంతో ముదిరాజ్ సంఘం నాయకులు అతడిని గ్రామంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎంపీఎస్ రాష్ట్ర చైర్మన్ ఈదునూరి సంతోష్‌ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.